ఐదు పట్టణాలకు అమృత్ 2.0 నిధులు

- రూ.286.54 కోట్లతో మంచినీటి, మురుగునీటి వ్యవస్థల అభివృద్ధి
- మొత్తం 11 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఇప్పటికే మూడు ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధం
- నెలాఖారులోగా మిగిలిన డీపీఆర్‌లు పూర్తిచేసేందుకు చర్యలు


భీమవరం పట్టణ వ్యూ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని ఐదు పట్టణాలను అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) 2.0 పథకం కింద ఎంపిక చేసి తాగునీటి సురక్షిత పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పట్టణాల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను మరింత మెరుగుపరిచేందుకు అమృత్ 2.0 పథకంలో రూ.286.54 కోట్లు ఖర్చు చేయనున్నారు. దీనిలో భాగంగా భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు, ఆకివీడు పట్టణాల్లో మంచినీటి సరఫరా, కుళాయి కనెక్షన్లు ఇవ్వడం, పైప్‌లైన్ల విస్తరణ, శుద్ధి చేసిన మురుగునీటిని రీసైకిల్ చేయడం (ఎస్టీపీల నిర్మాణం), నీటి సంరక్షణ, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ అభివృద్ధి, వాటర్ ట్యాంకుల నిర్మాణం, జగనన్న కాలనీల్లో ఎస్టీపీల నిర్మాణం తదితర పనులు చేయనున్నారు.

11 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు తయారీ

జిల్లాలోని ఐదు పట్టణాలను అమృత్ 2.0 పథకంలో మొత్తం 11 ప్రాజెక్టులుగా విభజించారు. పట్టణాల్లో, జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులకు విడివిడిగా నిధులు మంజూరు చేయడం జరిగింది. 11 ప్రాజెక్టు పనులకు ప్లబిక్ హెల్త్ శాఖ అధికారులు డీపీఆర్‌లు (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) తయారుచేస్తున్నారు. ఇప్పటికే మూడు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్‌లు పూర్తి చేసి సాంకేతిక మంజూరు చేయడం జరిగింది. అందులో తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు ఉన్నాయి. ఈనెలాఖరులోపు మిగిలిన 8 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు తయారుచేసి టెండర్ల ప్రక్రియ ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పట్టణాల వారీగా పనులు

పట్టణం	అమృత్ 2.0 నిధులు	పనులు
భీమవరం	రూ.65.48 కోట్లు	రూ 4.8 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు
		రూ.13.39 కోట్లతో జగనన్న కాలనీలో ఎస్‌టీపీ ప్లాంట్
		రూ.47.29 కోట్లతో నీటి సరఫరా అభివృద్ధి పనులు
తాడేపల్లిగూడెం	రూ.159.28 కోట్లు	రూ.41.79 కోట్లతో నీటి సరఫరా పనులు
		రూ 12.19 కోట్లతో జగనన్న కాలనీలో ఎస్‌టీపీ ప్లాంట్
		పట్టణంలో రూ 100.2 కోట్లతో ఎస్‌టీపీ ప్లాంట్
		రూ 5.1 కోట్లతో జగనన్న కాలనీలో నీటి సరఫరా పనులు
నర్సాపురం	రూ.21 కోట్లు	నీటి సరఫరా అభివృద్ధి పనులు
ఆకివీడు	రూ.32.42 కోట్లు	నీటి సరఫరా అభివృద్ధి పనులు
తణుకు	రూ.8.36 కోట్లు	జగనన్న కాలనీలో నీటి సరఫరా అభివృద్ధి పనులు

205–26 వరకు సమయం

అమృత్ 2.0 ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి వచ్చేఏడాది 2025–26 వరకు సమయం ఉంది. ఈఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి అమృత్ 2.0 ప్రాజెక్టు వేగవంతం చేయడానికి అధికారులకు సూచనలు, సలహాలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు.

మూడు ఎస్‌టీపీలు

అమృత్ పథకంలో జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెంలో మూడు చోట్ల ఎస్టీపీలు(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) నిర్మించనున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో రూ.100 కోట్లతో భారీ ఎస్‌టీపీ నిర్మాణం, జగనన్న కాలనీలో రూ.12.19 కోట్లతో, భీమవరం జగనన్న కాలనీలో రూ.13.39 కోట్లతో ఎస్‌టీపీ ప్లాంట్లు నిర్మించనున్నారు.

నెలాఖరులోపు టెండర్లు ప్రారంభిస్తాం



అమృత్ 2.0 పథకంలో ఐదు పట్టణాలకు సంబంధించి 11 ప్రాజెక్టులు ఉంటాయి. వాటికి సంబంధించి డీపీఆర్‌లు ఇప్పటికే మూడు పూర్తిచేయడం జరిగింది. మిగిలిన వాటికి డీపీఆర్‌లు తయారు చేస్తున్నాం. ఈనెలాఖరులోపు డీపీఆర్‌లు పూర్తి చేసి వచ్చే నెలలో టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టాలే చర్యలు తీసుకుంటున్నాం. మంచినీటి, మురుగునీటి వ్యవస్థ మెరుగుపర్చడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. 2025–2026 కల్ల ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంటుంది.

– ఆర్.విజయ్, ప్లబిక్ హెల్త్ డీఈ, పశ్చిమగోదావరి జిల్లా

సీఎం జగనన్న పాలనలో మహిళలకు గౌరవం

- జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ
- మహిళా శక్తితో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం
- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఉండిలో వైఎస్సార్ ఆసరా సంబరాలు


ఉండి వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, చిత్రంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


ఉండిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: మహిళల ఆశీర్వాదం మెండుగా ఉన్న జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కాబోతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ అన్నారు. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు) ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నాల్గవ విడత రుణమాఫీ సొమ్ము రూ.15.30 కోట్లు చెక్కును అందజేసారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేసారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళలకు సరైన గౌరవం సీఎం జగన్ ద్వారానే లభించిందన్నారు. ఇంటి స్థలాలు, సంక్షేమ పథకాలు అక్కచెల్లెమ్మల పేరుతో అందించి మహిళను సమాజంలో మరింత ఉన్నతంగా తీర్చిదిద్దారని అన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ మాట్లాడుతూ 2014లో చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని అన్నారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నాలుగు విడతల్లో రుణమాఫీ సొమ్ము చెల్లించారన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి మాట్లాడుతూ సామాన్య మహిళలకు ఉన్నత స్థానాలు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. మనకు మంచి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జీ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొత్రపాటి అనిత, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, ఆకివీడు జెడ్పీటీసీ యందగండి శ్రీను, హరివర్మ, గలావిల్లి ధనుంజయ, కమతం బెనర్జీ, బడుగు బాలాజీ, మునుకోలు సింహాచలం, రాయి సతీష్, బాలం తులసీ, సూరవరపు వెంకటాచార్యులు, జీ సుందర్‌కుమార్, తాటిపట్టి పెదవీరప్ప, గిరడ రమణ, గిరడ శ్రీను, వీరమల్లు సత్యవతి, బొచ్చా అచ్చారావు, వర్రే పైడియ్య, బుద్దరాజు రంగరాజు, వైస్ ఎంపీపీలు కనకదుర్గ, దత్తాల సుజాతరాణి, బందెల ప్రమీల, మున్నలూరి శ్రీను తదితర సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఎంసీ డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి


ఉండిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో గ్రామాల అభివృద్ధి వేగవంతమైందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మంగళవారం ఉండిలో సుమారు రూ.47 లక్షలతో సీసీ రోడ్లు, పక్కా డ్రెయిన్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎం సహకారంతో రూ.100 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జీ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, ఎంపీటీసీ గిరడ రమణ శ్రీను, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, యేడిద వెంకటేశ్వరరావు, రణస్తుల మహంకాళి పాల్గొన్నారు.

రూ.70 లక్షలతో రహదారుల నిర్మాణానికి చర్యలు

కాళ్ల: జక్కరం, దొడ్డనపూడి గ్రామాల్లో సుమారు రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మిస్తున్నట్టు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు తెలిపారు. మంగళవారం వారు జక్కరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ జక్కరంలో అభివృద్ధి పనులకు క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట వెంకట శ్రీనివాసరాజు ప్రత్యేక శ్రద్ధతో జెడ్పీ నిధులు రూ.50 లక్షలు తీసుకువచ్చారని, వాటితో గ్రామంలో సీసీ డ్రెయిన్లు, రహదారులు నిర్మిస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో అరుంధతి పేట, చిన్న పేట, కాలనీ, సర్రాజు నగర్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. అనంతరం దొడ్డనపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ .20 లక్షలతో సీసీ రహదారి నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పళ్ళిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స శిరీష విశ్వనాథ రాజు, జక్కరం సర్పంచ్ కుసంపూడి పద్మావతి, ఉప సర్పంచ్ లక్ష్మీపతి రాజు, గుండా సాయి, ఎంపీటీసీ ఇరింకి కాశీ జగన్నాథం, కొల్లి రామకష్ణ, చెన్నం శెట్టి దేవి వరప్రసాద్, కొల్లి తారకం, సయ్యపు రెడ్డి శ్రీకాంత్,యోహాను, పెనుమత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీపీఓ

ఉండి: ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆర్ విక్టర్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల పరిశీలన, మార్పులు, చేర్పుల్లో భాగంగా మంగళవారం మండలంలోని చిలుకూరు మెయిన్ స్కూల్‌లోని 36,37 నంబర్ పోలింగ్‌బూత్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికల కోసం నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాత్వీకం, వీఆర్వో విజయలక్ష్మి పాల్గొన్నారు.

చెస్‌లో ఉచిత శిక్షణ అభినందనీయం


వండర్ కిడ్స్ స్కూల్లో ఉచిత చెస్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవితేజ

భీమవరం: మేధస్సుకు పదునుపెట్టే చదరంగంలో క్రీడాకారులకు ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు గ్రంధి రవితేజ అన్నారు. భీమవరం పట్టణంలోని వండర్ కిడ్స్ స్కూల్లో మంగళవారం దివంగత గ్రంధి వెంకటేశ్వరరావు స్మారక ఉచిత చెస్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరరావు ఎన్నో సమాజిక కార్యక్రమాలకు చేయూతనిచ్చారన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్నిస్కూల్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వాలని చేపట్టిన కార్యక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య మాట్లాడుతూ చెస్ ద్వారా మేధస్సుకు పదునుపెట్టుకుని విద్యలో ఉన్నతంగా రాణించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్, స్కూల్ డైరెక్టర్ అల్లు వంశీ, మాజీకౌన్సిలర్ పాలవెల్లి మంగ, వనజాక్షి, చెరుకువాడ రంగసాయి, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళాల అందజేత

కాళ్ల: కాళ్ల మండలం కాళ్ళకూరులోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన భవనానికి పలువురు విరాళం అందించినట్లు దేవస్థానం ఈవో మోకా అరుణ్ కుమార్ మంగళవారం తెలిపారు. నెల్లూరు వాస్తవ్యులు ఎస్ఎస్ఎల్ ఆక్వా అధినేత బండి సృజన్ కుమార్ రెడ్డి, శిరీష అన్నదాన భవన నిర్మాణానికి రూ.2,00,116, ఆకివీడు మండలం సిద్దాపురం వాస్తవ్యులు గొట్టుముక్కల రామచంద్రరాజు, వెంకటలక్ష్మి దంపతులు రూ.1,00,116 విరాళం అందించినట్లు ఈఓ తెలిపారు.

విద్యా వ్యవస్థలో డిజిటల్ విప్లవం

కాళ్ల: విద్యా వ్యవస్థలో డిజిటల్ విప్లవానికి నాంది పలికిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. మండలంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కోపల్లెలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. సుమారు రూ.40 వేలు విలువచేసే ట్యాబ్‌లు విద్యార్థులకు అందివ్వడంతో హర్షణీయమన్నారు. పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడమే కాకుండా విద్యార్థులకు అవసరమయ్యే నోట్ బుక్స్, యూనిఫామ్, బ్యాగులు, విద్యాసామగ్రి ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. పాఠశాలలో 124 ట్యాబ్లు విద్యార్థులకు అందిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథ రాజు, మంతెన రామ కుమార్ రాజు, దంతులూరి కోటేశ్వరరాజు పాల్గొన్నారు.

మోగల్లు పంచాయతీలో వార్షిక ఆడిట్

పాలకోడేరు: మోగల్లు పంచాయతీలో వార్షిక ఆడిట్ మంగళవారం ప్రారంభమైంది. అసిస్టెంట్ ఆడిట్ అధికారి ఎంఆర్ కుమారి రికార్డులను తనిఖీ చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి కనుమూరి వెంకటరాజు, సచివాలయ కార్యదర్శి మహాలక్ష్మి ఉన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులపై సమీక్ష

భీమవరం అర్బన్: మండలంలోని అభివృద్ధి పనులపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ టీకేఎస్ఎస్ వెంకటరమణ సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీ తదితర శాఖలలో అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జామి శ్రీనివాస్‌కు పరామర్శ

ఆకివీడు: స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి భర్త జామి శ్రీనివాస్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ గంట పద్మశ్రీ, నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీ లక్ష్మి మంగళవారం పరామర్శించారు. కిడ్నీల వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆరోగ్య విషయాల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాస రెడ్డి, వైస్‌చైర్మన్లు వంగా జ్యోత్స్న, పుప్పాల పండు, కఠారి కేశవరావు, జోగి నాగరాజు, కౌన్సిలర్ గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, యర్రా కేశవ, శిరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకోడేరు ఎంపీడీఓగా టి.అనూహ్య

పాలకోడేరు: ఎన్నికల బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లా ఘంటసాల మండలం నుంచి పాలకోడేరు మండలానికి టి అనూహ్య బదిలీపై వచ్చారు. మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈమె స్వస్థలం విజయవాడ. ఈమె గ్రూప్ 1 పరీక్షలు రాసి ఎంపీడీఓగా సెలెక్ట్ అయ్యారు. తొలుత రెండు నెలల క్రితం కృష్ణా జిల్లా మండలం ఎంపీడీఓగా ఘంటసాల మండలంలో ఎంపీడీఓగా చేరి, ఎన్నికల్లో భాగంగా బదిలీపై వచ్చారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు)ను, మర్యాద పూర్వకంగా కలిసారు. వీరి వెంట డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం నాగభూషణం నాయుడు, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు ఉన్నారు.

కోర్టు డైరీలు ఎంతో ప్రయోజనకరం

భీమవరం: ఐఏఎల్ వాల్ క్లాక్, కోర్టుడైరీలు న్యాయవాదులకు, కోర్టు సిబ్బంది, పోలీసులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. ఐఏఎల్ రూపొందించిన క్యాలెండర్, గడియారాలు, డైరీలను మంగళవారం భీమవరం కోర్టులో ఆవిష్కరించారు. ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంవీ రమణరావు, కార్యదర్శి పాకా రమేష్, ఐఏఎల్ నాయకులు పి.సునీల్‌కుమార్, మేకా శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రహదారి నిర్మాణ పనులు

వీరవాసరం: పాలమూరు- నవుడూరు మధ్య సీసీ రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.2 కోట్ల నిధులతో ఈ రహదారి నిర్మిస్తున్నారు. వీరవాసరం - నవుడూరు రోడ్డును రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. పంజావేమవరం నుంచి అరట్లకట్ట వరకు మరో రూ.3 కోట్లతో రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. పాలమూరు-నవుడూరు రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో రహదారిపై రాకపోకలకు ఆంక్షలు విధించారు.

జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్

పాలకోడేరు: పాలకోడేరు మండలంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం వేగవంతంగా సాగుతోంది. మండలంలో 2,799 ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా, ఇప్పటివరకు 600 ఇళ్లకు రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. పెన్నాడ, కుముదవల్లి గరగపర్రు గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపీడీవో అనూహ్య గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. దీనిపై చర్చించేందుకు ఎంపీడీవో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించనున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధిలోని నల్లంవారితోటకు చెందిన జె.నాగరాజు (30) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగరాజు సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత స్నానానికి వెళ్లి ఎంతసేపటికి రాలేదు. అనుమానం వచ్చి ఇంటి వెనక్కి వెళ్లి చూడగా వేప చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతు ఉన్నట్లు అతని భార్య దుర్గా మల్లేశ్వరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఐదు మద్యం సీసాల స్వాధీనం

భీమవరం: పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలోని నాచువారి సెంటర్లోని ఒక దుకాణం వద్ద 5 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మంగళవారం నాచువారి సెంటర్‌లోని ఓ షాపు దాడి చేయగా మదం సీసాలు ఉండడంతో షాపు నిర్వాహకుడు ఆర్.శ్రీనివాసరావు కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

పాలకోడేరు: కుమదవల్లి శివారు ప్రాంతంలో మంగళవారం తమ సిబ్బందితో కలిసి దాడి చేసి, కోతాట ఆడుతున్న ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్టు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు వారి నుంచి రూ.1,500 నగదు, స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు

నిర్యాణం

మంచితనం, ఉన్నతమైన వ్యక్తిత్వం, మా అందరికీ అపారమైన ఆప్యాయత,
అనురాగాలు పంచి, అకస్మాత్తుగా దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ.. అశ్రునయనాలతో...



జననం : 28-04-1957

మరణం : 29-01-2024

కీ॥శే॥ శ్రీ గనిశెట్టి చంద్రశేఖర్ గారు

Chairman

GM Electrical Systems India Pvt.Ltd.

Ex. President, COOPERATIVE BANK

Ex. National Director, IFFCO

తేది : 29-01-2024 అనగా సోమవారం స్వర్గస్తులైనారు. కావున
తేది : 08-02-2024 అనగా గురువారం నాడు
పెద్దకార్యం, మా స్వగృహమునందు, కాళ్ల గ్రామం లో
జరుపబడును అని తెలియజేయడమైనది.

శోకతప్త హృదయాలతో...

కుటుంబ సభ్యులు – బంధుమిత్రులు

సెల్ : 76708 37527, 92480 91087